క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సదస్సులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద శనివారం నుంచి వినియోగదారులు, రైతులతో సదస్సులు నిర్వహించనున్నట్లు డీఈ వరప్రసాద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రైతులు, వినియోగదారులు పాల్గొని, వారి విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. శనివారం మండల పరిధిలోని జువ్వలపాళెం, అన్నమేడు, కల్లిపేడు విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సదస్సులు ఉంటాయన్నారు. 22వ తేదీ ఓజిలి మండలం ఆర్మేనిపాడు, వజ్జవారిపాళెం, పెళ్లకూరు మండలం చెంబేడు విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద, 23వ తేదీ నాయుడుపేట పట్టణం, పుదూరు, గొట్టిప్రోలు, ఓజిలి మండలం కర్రబల్లోలు, పెళ్లకూరు మండలం కేజీ కండ్రిగ విద్యుత్ సబ్ స్టేషన్‌ల వద్ద సదస్సులు ఉంటాయన్నారు. 24వ తేదీ నాయుడుపేట టౌన్, మేనకూరు, ఓజిలి మండలం కురుగొండ, పెళ్లకూరు మండలం శిరసనంబేడు విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద, 25వ తేదీ నాడు కోనేటి రాజుపాళెం, ఓజిలి మండలం కేంద్రం, పెళ్లకూరు మండల కేంద్రాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల సదస్సులు జరుగుతాయన్నారు.

సచివాలయ సిబ్బందికి ఫిజియో శిక్షణ

తడ: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై ఉచిత శిక్షణ శుక్రవారం ఉచితంగా అందించారు. నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయ సీఈఓ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. హైదరాబాద్ నిజామ్స్ ఆసుపత్రికి చెందిన ఫిజియోథెరపిస్టులు రమేష్, సతీష్ కుమార్ శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీపీ కె.రఘురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంపీపీ ఫిజియోథెరపిస్టులను సత్కరించారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

దొరవారిసత్రం: చందనముడి గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జైభీమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన చిట్టిబాబు సహకారంతో వేసవి కాలంలో ముగిసే వరకు మజ్జిగ అందజేసేందుకు ముందుకు వచ్చారు. శుక్రవారం స్థానిక ఎంఈఓలు మునిశేఖర్, కృష్ణయ్య చేతుల మీదుగా విద్యార్థులకు మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శేషయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటరమణమ్మ, ట్రస్ట్ వైస్ చైర్మన్ సంధ్యరాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల వద్ద అన్నదానం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద శుక్రవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వాహకురాలు కృష్ణవేణి దాతల చొరవతో ప్రభుత్వ వైద్యశాల వద్ద శుక్రవారం 170వ అన్నదానం కార్యక్రమం చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వైద్యశాలకు వచ్చే వారికి, రోగులందరికీ మంచి భోజన వసతి కల్పిస్తున్నారు. శుక్రవారం జరిగిన అన్నదానానికి నాయకులు అకుల కుబేరు మణి ఉభయదాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ ఆలయ పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, బలిజ సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌కు సేవా పతకం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వి.నారాయణకు సేవా పతకం పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ పోలీసు, ఫైర్ స్టేషన్‌ల పరధిలో విధి నిర్వహణలో విశిష్ట సేవలందించినందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన పురస్కారాల్లో వెంకటగిరి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నారాయణకు సేవా పతకం లభించింది. దీంతో అగ్నిమాపక కార్యాలయ సిబ్బందితోపాటు పలువురు ఆయన్ను అభినందించారు.

అడవుల సంరక్షణపై అవగాహన

కలువాయి(సైదాపురం): అడవులను సంరక్షించుకుందామని రాపూరు రేంజ్ డీఆర్‌ఓ కాజారసూల్ కోరారు. మండలంలోని కుల్లూరు ఎస్టీ కాలనీలో గురువారం రాత్రి కళాబృందం సభ్యులతో అడవులను కాపాడుకునే విధానంపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓ మాట్లాడుతూ కుందేళ్లు, దుప్పులతోపాటు అడవి పందులను కరెంట్ పెట్టి చంపడం నేరమన్నారు. అడవికి నిప్పు పెడితే మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. ఎవరైనా అడవులకు హాని చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎఫ్‌బీఓ నాగులు, రాహుల్, భాగ్యరాజ్ తదితరులున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోట: చెట్టు మీద నుంచి పడి కల్లు గీత కార్మికుడు గాయపడిన సంఘటన శుక్రవారం తిన్నెలపూడిలో చోటుచేసుకుంది. తిన్నెలపూడికి చెందిన రమణయ్య కల్లు గీసేందుకు చెట్టు ఎక్కి అదుపుతప్పి జారిపడడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

నాయుడుపేట టౌన్: అంతర్జాతీయ గణిత ఒలంపియాడ్ (ఐఎంఓ) పరీక్షల్లో ప్రతిభ చూపిన అన్నమేడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం హెచ్ఎం మధుసూదన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. ఒలింపియాడ్ ఫౌండేషన్ వారు పంపిన ప్రోగ్రెస్ రిపోర్టులు, ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందించారు. ఉపాధ్యాయులు మహమ్మద్ షఫీవుల్లా, వైఎస్ చక్రవర్తిలను అభినందించారు.

పుచ్చ గాయాలు

- దిగుబడి తగ్గి, సైజు పెరగని పుచ్చకాయలు
- పుచ్చ రైతులకు అవగాహన కల్పించలేని అధికారులు


రామాపురంలో పుచ్చ తోట

చిట్టమూరు: మండలంలోని మెట్ట ప్రాంతాల్లో రైతులు ఈ సంవత్సరం పుచ్చ సాగు చేపట్టారు. ధరలు తగ్గి పోవడం, దిగుబడి ఆశించిన మేర రాకపోవడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళల సోకడంతో దిగుబడి తగ్గడంతోపాటు కాయ సైజు కూడా పెరగలేదు. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మండలంలో రామాపురం, చిల్లమూరు, మొలకలపూడి గ్రామాల్లో రైతులు విరివిగా పుచ్చ సాగు చేశారు. ప్రస్తుతం కోతకు రావడంతో రైతులు పుచ్చకాయలను కోసి తక్కువ రేటుకు అమ్ముకుంటున్నారు. అయితే ఈ సాగులో రైతులు విత్తనాలను బెంగళూరు, నెల్లూరు నుంచి తెచ్చి వేశారు. ఈ మూడు గ్రామాల్లో రైతులకు పంట సాగులో మెళకువలపై అధికారుల నుంచి ఎటువంటి సలహాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. చిట్టమూరు మండలంలో 350 ఎకరాల్లో పుచ్చ సాగు చేసేవారు. ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవడంతో ప్రస్తుతం సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోయింది. అయినప్పటికీ బావులు, గుంతల్లోని నీటి ఆధారంగా పుచ్చ సాగు చేపట్టారు.

తప్పని నష్టాలు

గత సంత్సరం ఎకరాకు 10 నుంచి 15 టన్నుల దిగుబడి వచ్చింది. అయితే ఈ సంవత్సరం ఎకరాకు 2 నుంచి 3 టన్నులు మాత్రమే దిగుబడి వస్తోంది. ఒక్క ఎకరాకు పెట్టుబడి రూ.30 వేలు వరకు ఖర్చు అవుతోంది. ప్రస్తుతం టన్ను కాయలు సైజును బట్టి రూ.5000 ధరతో స్థానికంగా ఉన్న వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కాయ సైజు చిన్నదిగా ఉండడంతో సగానికి పైగా ధర పడిపోయింది. ప్రస్తుతం టన్ను పుచ్చకాయలను రూ.5 వేల నుంచి రూ.6 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అది కూడా కొనేవారు లేక కొంత మంది రైతులు పొలాల్లోనే కాయలు వదిలేస్తున్నారు. గతంలో కాయ 10 నుంచి 25 కేజీల వరకు పెరిగిందని ఈ సంవత్సరం 2 కేజీల నుంచి 4 కేజీలు మాత్రమే బరువు పెరిగింది. ధర చూస్తే కాయ సైజు చిన్నదిగా ఉండడంతో టన్ను రూ.2 వేలు నుంచి రూ.5 వేలు మాత్రమే పలుకుతోంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు రాకపోవడంతో స్థానికంగానే అమ్ముకుంటున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.30 వేలలో ప్రస్తుతం అందులో సగం కూడా రాకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. మంచు విపరీతంగా కురవడంతో తెగుళ్లు సోకడంతో పెట్టుబడులు పెరిగి పోవడంతో నష్టం వాటిల్లితోంది.


చిన్న సైజులో ఉన్న పుచ్చ తోట

పుచ్చ సాగు చేసి నష్టపోయాం



“ఈ సంవత్సరం పుచ్చ సాగు ఆశాజనకంగా లేదు. ధరలు లేకపోవడం, దిగుబడి తగ్గిపోవడం, ఖర్చులు పెరగడంతో తీవ్రంగా నష్టపోయాం. గతంలో మంచి లాభాలు వచ్చేవి. అది చూసి పుచ్చ సాగు చేస్తే ఈ ఏడాది నష్టాల పాలయ్యాం.

– సంచి మల్లికార్జున, రైతు, రామాపురం

ఢిల్లీ నుంచి వచ్చి కొనేవాళ్లు



మా గ్రామంలో పండించిన పుచ్చకాయలను దేశ రాజధాని ఢిల్లీ నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. ప్రస్తుతం కాయ సైజు చిన్నదిగా ఉండడంతో వారు ఈ సంవత్సరం కాయలు కొనుగోలు చేసేందుకు రాలేదు. స్థానికంగా ఉన్న వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. – గంగాల రమణయ్య, మొలకలపూడి

29న సర్వసభ్య సమావేశం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వేసవికాలంలో తాగునీటి సమస్యల పరిష్కారంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనపై మండల సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కోర్టు ప్రాంగణంలో పాము హల్‌చల్


కోర్టు ప్రాంగణంలో పాము

కోట: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం నాగు పాము హల్‌చల్ చేసింది. కోర్టు ప్రాంగణంలో జనం మధ్యకు పాము రావడంతో భయాందోళన చెందిన బాధితులు పరుగులు తీశారు. ఇంతలో పాము అక్కడే ఉన్న కారులోకి వెళ్లడంతో పాములు పట్టే మౌలా అనే వ్యక్తిని పిలిపించి పామును పట్టి చిట్టేడు అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి

- చొరవ చూపిన వేనాటి సతీష్‌రెడ్డి

సూళ్లూరుపేట: టీడీపీ తిరుపతి పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దొరవారిసత్రం మండలం మినిమల మూడి గ్రామానికి బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. మినిమలమూడికి చెందిన బండి సందీప్ అనారోగ్యంతో బాధపడుతుండగా సీఎం సహాయనిధి నుంచి రూ.6,02,446 నగదు చెక్కును వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో అందజేశారు. టీడీపీ కార్యకర్త బండి సందీప్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, వైద్యం చేయించుకోవడానికి పొలం అమ్మేసి చేయించుకున్నారని సతీష్‌రెడ్డి మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి ఆరు లక్షలు నగదు ఇప్పించారు. ఆ చెక్కును బాధిత కుటుంబ సభ్యులను పిలిపించి టీడీపీ కార్యాలయంలో అందించారు.

పనికి తగిన వేతనం ఉండాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ వరప్రసాద్

బాలాయపల్లి(సైదాపురం): ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలకు పనికి తగిన వేతనం కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్ పని చేయాలని క్లస్టర్ ఏపీడీ వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో ఉపాధి పనులను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు వారి వ్యవసాయ పొలాల్లో ఫారం ఫారం పాండ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కూలీలకు రోజుకు రూ.300 కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలన్నారు. ఎంపీడీఓ వినిల్ కుమార్, ఏపీఓ ఆశారాణి, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఆరో వార్షికోత్సవాలు

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో వెలసియున్న శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆరో వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 25వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఉదయం స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు, విశేష పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. రాత్రి స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

భవిత పాఠశాలలో పిల్లల దినోత్సవం


భవిత స్కూల్‌లో పిల్లలకు ఉపకరణాల పంపిణీ

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని భవిత ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రంలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ పిల్లల దినోత్సవాన్ని శుక్రవారం ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్సిల్‌బాక్స్‌లు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. అలాగే విద్యార్థులు పి.శశిధర్‌రెడ్డి, పి.శిరీష, హెచ్.లోహిత్‌లకు పుట్టినరోజు కావడంతో వారికి కొత్త బట్టలను అందజేశారు. వారితో కేక్ కట్‌చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిరామ్, మాలకొండయ్య, దాసు, ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు, భవిత స్కూల్ సహిత ఉపాధ్యాయిని వీటీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి గడువు పెంపు

దొరవారిసత్రం: బీసీ గురుకుల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్‌తో పాటు 6, 7, 8, 9వ తరగతుల్లో చేరేందుకు బ్యాక్‌లాగ్ సీట్లు భర్తీ కోసం దరఖాస్తు గడువు ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని స్థానిక ప్రిన్సిపల్ తిరుపతయ్య తెలియజేశారు. 5లోకి చేరే విద్యార్థులకు ఏప్రిల్ 27న, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి మే నెల 4న, బ్యాగ్‌లాగ్ సీట్లు కోసం దరఖాస్తు చేసున్న విద్యార్థులకు ఏప్రిల్ 28న డీవీ సత్రం గురుకుల పాఠశాలలోనే ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

కోటలో..

కోట: బీసీ గురుకులాల్లో ప్రవేశానికి సొసైటీ వారు నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు కోట బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నారాయణరావు తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాలలో మాట్లాడుతూ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్‌లో చేరుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జలవనరుల శాఖ ఈఈగా బాబీరెడ్డి


నీటి పారుదల శాఖ ఈఈ బాబీ

వెంకటగిరి(సైదాపురం): జలవనరుల శాఖ వెంకటగిరి ఈఈగా బాబీరెడ్డి శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో వెంకటగిరిలో డీఈగా విధులు నిర్వర్తిస్తూ ఇన్‌చార్జి ఈఈగా వ్యహరించారు. ఈ క్రమంలో ప్రభుత్వం విడుదల చేసిన పదోన్నతుల్లో ఈఈగా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. జలవనరుల శాఖ డీఈలు, జేఈలు, ఏఈలు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో అభినందించి స్వాగతం పలికారు.

మన బండ్లే.. వదిలెయ్


పట్టుకున్న ప్రొక్లెయినర్


పట్టుకున్న లారీలు

కలువాయి(సైదాపురం): ×హలో వీఆర్వో....హలో పట్టుబడిన ప్రొక్లెయిన్,టిప్పర్లు మనోళ్లవే...వాటిని వదిలేయండి౯ అంటూ రెవెన్యూ సిబ్బందికి కూటమి ముఖ్యనేతలు ఫోన్లు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. దీనికి ఆ వీఆర్‌ఓ కూడా సై అనడంతో వాహనాలను మధ్యలోనే వదిలేశారు. దీంతో గ్రామస్తులు భీష్మించిన ఘటన కలువాయి మండలంలోని కుల్లూరులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కుల్లూరు గ్రామంలోని పెయ్యలతిప్ప వద్ద నుంచి గత మూడు రోజులుగా భారీ యంత్రాల సహాయంతో రాజుపాళెంలో ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంప్ నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా భారీ వాహనాల్లో గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా ఒక్కటై వీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్‌ఓ జనార్దన్ గురువారం రాత్రి నిఘా వేసి ఓ ప్రొక్లెయినర్, రెండు లారీలను పట్టుకున్నారు. అప్పటి నుంచి కూటమి నేతలు వీఆర్‌ఓకు ఫోన్లు చేసి వదిలేయమని ఒత్తిడి తెచ్చారు. ఒత్తిడి భరించలేని వీఆర్‌ఓ వాహనాలను వదిలేశారు. దీనిపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

కండలేరులో 49.900 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 49.900 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 580, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 80, మొదటి బ్రాంచ్ కాలువకు 25 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

గాలికుంటు సోకకుండా టీకాలు

రాపూరు: మండలంలోని సిద్దవరం గ్రామంలో గాలి కుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు మూగ జీవాలకు శుక్రవారం టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి సోకితే పాలు తగ్గిపోతాయని, నోట్లో పుండ్లు, చొంగకారడం, మేత మేయవన్నారు. సిద్ధవరం గ్రామంలో 500 మూగజీవాలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు ఆయన వివరించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది పెంచలరెడ్డి, భవాని, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


ఎన్‌బీకేఆర్‌లో పోస్టర్ ఆవిష్కరణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఏప్రిల్ 3వ తేదీన ఈఈఈ విభాగం ఆద్వర్యంలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పలు రాష్ట్రాల్లోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై ప్రాజెక్ట్ ప్రజంటేషన్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ సురేష్‌రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హుల జాబితాపై గ్రామసభ

కోట: కొత్తపట్నంలో తహశీల్దార్ జయజయరావు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమల కోసం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు వారితో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో అధికారులు అర్హుల జాబితాను వెల్లడించగా వాటిలో 151 మంది తమకు అభ్యంతరాలు ఉన్నట్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. రైతులు తెలిపిన అభ్యంతరాలపై విచారణ జరిపి తుది జాబితాను రూపొందిస్తామని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపాలయ్య, సర్వేయర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

కోట: సీసీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. ప్రధాన రహదారికి ఒకవైపు మాత్రమే సీసీ రోడ్డు వేసి వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం విద్యానగర్‌కు చెందిన వ్యాపారి శ్రీకాంత్ కోటకు మోటార్‌బైక్‌పై వస్తూ ఇరుకైన రోడ్డులో అదుపుతప్పి పడ్డాడు. సీసీ రోడ్డుకు ఒకవైపు ఉన్న ఇనుపకమ్ములు అతని పాదానికి గుచ్చుకోవడంతో తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే అతన్ని కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

చిల్లకూరు: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించేలా ఆటో డ్రైవర్లు మసలుకోవాలని గూడూరు పట్టణ సీఐ శేఖర్‌బాబు సూచించారు. గూడూరు పట్టణంలోని టవర క్లాక్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం సీఐ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండో పట్టణ వై జంక్షన్ వద్ద టూటౌన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం రాజు ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

పరిహారం చెల్లింపులపై నిరసన

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో సేకరించిన భూముల పరిహారంలో సమన్యాయం పాటించాలని లింగవరం గ్రామానికి చెందిన పేదలు నిరసన వ్యక్తం చేశారు. తీర ప్రాంతంలోని తీగపాళెం వద్ద భూ పరిహారంపై చర్చించేందుకు రైతులు, గ్రామస్తులతో శుక్రవారం రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ క్రిస్ సిటీ కోసం సేకరించిన 914 ఎకరాలు భూములలో 617 ఎకరాలకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని అన్నారు. దీనిపై తమ్మినపట్నం గ్రామస్తులు మాట్లాడుతూ అభ్యంతరాలపై పూర్తి స్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బీడు భూములకు కూడా పరిహారం అందించేలా చూడాలన్నారు. దీనిపై లింగవరం గ్రామస్తులు సమావేశం వద్ద నిరసన వ్యక్తం చేసి అందరికి సమన్యాం పాటించేలా చూడాలని కోరారు. సర్వేయర్, గ్రామ సుర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బిల్ కలెక్టర్ చేతివాటం


వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపాలిటీకి సంబంధించి దుకాణాల సుముదాయం అద్దె వసూళ్లలో ఇక్కడి ఓ బిల్ కలెక్టర్ చేతి వాటం ప్రదర్శించినట్లు పలువురు బాధితులు కమిషనర్ షేక్ ఫజులుల్లాకు ఫిర్యాదు చేశారు. దుకాణాలు అద్దెలు చెల్లించని క్రమంలో ఆ దుకాణాలకు కమిషనర్ తా ళాలు వేస్తుండడంతో ఆ బిల్ కలెక్టర్ చేతివాటం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి దుకాణాల సముదాయానికి సంబంధించి 17, 24 నంబర్ల దుకాణాలకు బిల్ కలెక్టర్ కోటా రమేష్‌కు రూ.96 వేలు అద్దె చెల్లించా మని తమకు రశీదు కూడా ఇచ్చినట్లు లీజుదారులు తెలిపారు. అయితే వారు చెల్లించిన నగ దు కార్యాలయంలో జమ కాలేదని సిబ్బంది చెప్పడంతో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బిల్ కలెక్టర్ కోటా రమేష్‌పై గతంలో కూడా ఇదే విధంగా పలు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై మున్సి పల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా శుక్రవారం కార్యాలయంలో మీడియాతో మా ట్లాడారు. ఇద్దరు మున్సిపల్ దుకాణాల లీజుదారులు వచ్చి అద్దెకు సంబంధించి నగదును బిల్ కలెక్టర్‌కు చెల్లించినట్లు తెలిపారన్నారు. అయితే ఆ నగదు కార్యాలయంలో జమ కాలేదన్నారు. బిల్ కలెక్టర్లు చేస్తున్న వసూళ్ల విషయమై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

గిరిజనుల సమస్యలు పట్టించుకోండి


భూపయ్య కాలనీలో డ్రైనేజీ కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్న సీపీఎం నాయకులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని భూపయ్య కాలనీలోని గిరిజనుల సమస్యలపై అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు తీవ్రంగా విమర్శించారు. భూపయ్య కాలనీలో శుక్రవారం సాయంత్రం స్థానిక ఆ పార్టీ నాయకులు ఎస్.ముకుంద తదితరులతో కలసి పర్యటించారు. కాలనీలో 50 ఏళ్లుగా ఉన్న రహదారిని మూసివేసేందుకు బడాబాబులు కుయుక్తులు పన్ను తున్నారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా కాలనీలో డ్రైనేజీ కాలువల్లో మురుగు నీరు వేళ్లేందుకు ప్రధాన డ్రైనేజీ కాలువను నిర్మించాలని గిరిజనులు కోరతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో సీపీఎం నాయకులు కాలువల్లో బ్లీచింగ్ వేశారు.

తీరప్రాంత గ్రామాలను అభివృద్ధి చేయండి


వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేట: తీరప్రాంత గ్రామాలైన పేర్నాడు, వేనాడు దీవులకు తారురోడ్లు వేయడానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని, రోడ్ల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాలని అటవీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శుక్రవారం శాసనసభ ఆవరణలోని ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. పేర్నాడు దీవుల్లో 16 గ్రామాలు, వేనాడు దీవిలో 5 గ్రామాల్లో ప్రజా సౌకర్యాల నిమిత్తం అటవీశాఖ క్లియరెన్స్ ఇవ్వాలని,నిధులు కూడా మంజూరు చేసి తారు రోడ్డు వేయించాలని ఆమె శాసనసభ సమావేశాల్లో వినిపించారు. శాసనసభ బయట కూడా సంబంధిత మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ వి.రాజా

సూళ్లూరుపేట: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం బాధ్యతగా తీసుకోవాలని ఐక్యూ ఏసీ కన్వీనర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ వి.రాజా అన్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ అధ్యక్షతన శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వి.రాజా మాట్లాడుతూ అడవులను విచక్షణా రహితంగా నరికివేయడంతో కాలుష్యశాతం రోజు రోజుకు పెరుగుతోందన్నారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.వి క్టోరియా రాణి, జంతుశాస్త్ర అధ్యాపకుడు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ అడవులతో లాభ, నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా అడవులు, పర్యావరణ ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. సీహెచ్ మధుబాబు, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్ఐ మృతికి సంతాపం


నగదును అందిస్తున్న తహశీల్దార్

చిట్టమూరు: తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేస్తున్న డి.శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ కాయల సతీష్ కుమార్ ఆర్ఐ నివాసం ఉండే నాయుడుపేటకు సిబ్బందితో వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్య క్రియలకు రూ.25 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అతి చిన్న వయస్సులోనే శ్రావణ్ కుమార్‌కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో తిరుపతి వైద్య శాలలో చికిత్స పొందుతూ చనిపోవడం బాధాకరమన్నారు. డీటీ విజయలక్ష్మి, రీ సర్వే డీటీ నిరంజన్‌కుమార్, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.